క్లుప్తంగా

కేటీఆర్‌ను కలిసిన 'దిండిగల'



కేటీఆర్‌తో దిండిగల రాజేందర్

ఇల్లెందు: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఉమ్మడి ఖమ్మం జిల్లా బీఆర్‌ఎస్ మాజీ అధ్యక్షుడు దిండిగల రాజేందర్ శనివారం హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో కలిశారు. ఇల్లెందు నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులను కేటీఆర్‌కు వివరించారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలు ప్రజలకు వివరించి చేపట్టబోయే ప్రజాఉద్యమాలపై చర్చించారు.

విధుల్లో చేరిన గ్రామపాలన అధికారులు

పాల్వంచరూరల్: గతంలో వీఆర్‌ఓలుగా పనిచేసిన వారిని ప్రభుత్వం గ్రామపాలన అధికారులు (జీపీఓ)లుగా తిరిగి విధుల్లోకి తీసుకుంది. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం ఏడుగురు బాధ్యతలు స్వీకరించారు. పాల్వంచ మండలంలోని 16 రెవెన్యూ క్లస్టర్లు ఉన్నాయి. ఇందులో 14మంది జీపీఓలను నియమించారు. యానంబైల్, తోగ్గూడెం, పాండురంగాపురం, పాల్వంచ 1, 2, 3 పాయకారియానంబైల్ పంచాయతీల జీపీఓలు బాధ్యతలు స్వీకరించినట్లు తహసీల్దార్ దారాప్రసాద్ తెలిపారు. మరో ఏడుగురు సోమవారం విధుల్లో చేరనున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులు స్వశక్తితో ఎదగాలి

పాల్వంచ: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని స్వశక్తితో ఎదిగేలా కృషి చేయాలని మణుగూరుకు చెందిన అను క్రియేషన్స్ నిర్వాహకురాలు లక్ష్మీజ్యోతి అన్నారు. శనివారం స్థానిక సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల కొత్తగూడెంలో విద్యార్థులకు ఉమెన్ ఎంపవర్‌మెంట్ ఆర్గనైజేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు వృత్తి విద్యా కోర్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీ డాక్టర్ డి.విజయశాంతి, అధ్యాపకులు ఎస్‌కె.జకీరా బేగం, బి.పావని, బి.హిమబిందు, ఎ.అనూష, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు పెద్దమ్మతల్లి ఆలయంలో వేలంపాట

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయంలో సోమవారం ఉదయం 11గంటలకు బహిరంగ వేలంపాటలు నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయ పరిధిలోని, వ్యాపార దుకాణాలు, చీరల పోగుచేసుకునేందుకు, పూలదండలు విక్రయించుకునేందుకు లైసెన్స్ హక్కులు పొందేందుకుగాను, పాతషాపులో బొమ్మలు, బల్లల విక్రయాలకుగాను సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలంపాటలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

యాజమాన్యం విధానాలపై నిరసన



మాట్లాడుతున్న మల్లికార్జున్‌రావు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి యాజమాన్య విధానాలు, స్ట్రక్చరల్ కమిటీ ఒప్పందాలపై సర్క్యులర్ చేయని కారణంగా శుక్రవారం నాటి సమావేశాన్ని బహిష్కరించామని ఏఐటీయూసీ కొత్తగూడెం బ్రాంచ్ కార్యదర్శి వట్టికొండ మల్లికార్జున్‌రావు తెలిపారు. శనివారం కొత్తగూడెం పీవీకే–5 గని ఆవరణలో ఆయన మాట్లాడుతూ గత ఏడాది రెండుసార్లు జరిగిన సమావేశాల్లో ఒప్పుకున్న అంశాలపై సర్క్యులర్లు ఇవ్వలేదన్నారు. ఇక సొంతింటి పథకంపై కమిటీ వేసినా సమావేశం జరగలేదని తెలిపారు. అలాగే, లాభాల వాటా, ట్రాన్స్‌ఫర్ పాలసీకి నిరసనగా సమావేశాన్ని బహిష్కరించినట్లు చెప్పారు. గట్టయ్య, కతర్ల రాములు, సందేబోయిన శ్రీనివాస్, ఎస్.నాగేశ్వరరావు, వీరయ్య పాల్గొన్నారు.

జీపీ కార్మికుడు మృతి

జూలూరుపాడు: జూలూరుపాడు గ్రామ పంచాయతీ కార్మికుడు కంచపోగు వెంకటేశ్వర్లు అలియాస్ వెంకన్న(48) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. ఎస్సీ కాలనీకి చెందిన వెంకటేశ్వర్లు జీపీ ట్రాక్టర్‌గా డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మృతుడికి భార్య గురవమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. వెంకన్న భౌతికకాయాన్ని జీపీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏదులాపురం గోపాల్‌రావు సందర్శించి, పూలమాల వేసి నివాళులర్పించారు.



మధురం.. సీతాఫలం

- ఈ ఏడాది ముందస్తుగా దిగుబడి
- కేజీ రూ.150 – 200
- సీజనల్ వ్యాపారులకు ఉపాధి



పాల్వంచలో సీతాఫలాలు అమ్ముతున్న చిరువ్యాపారి

సండే స్పెషల్

పాల్వంచరూరల్: వానలు ముందస్తుగా కురవడంతో సీతఫలాల చెట్లకు కాత కూడా ముందుగానే వచ్చింది. బతుకమ్మ, దసరా పండగల సమయంలో వచ్చే సీతాఫలాలు ఈ ఏడాది ఇప్పుడే కన్పిస్తున్నాయి. ఏజెన్సీ, పారిశ్రామిక ప్రాంతమైన పాల్వంచ పట్టణ, మండలంలో వ్యాపారులు ఛత్తీస్‌గఢ్ నుంచి సీతాఫలాలను తెచ్చి విక్రయిస్తున్నారు. డజన్ కేజీ రూ.150 నుంచి 200 చొప్పున అమ్ముతున్నారు. పేదల యాపిల్‌గా, మధురఫలంగా పేరుగాంచిన సీతాఫలాలు అంటే ఇష్టపడనివారు ఉండరు. చిన్నారుల దగ్గర నుంచి వృద్ధుల వరకు ఇష్టపడే సీతాఫలాలు వీపణి వీధుల్లో లభ్యమవుతున్నాయి. ఈ ఏడాది సీతాఫలాల చెట్లు ముందుగానే విరివిగా కాయడంతో మార్కెట్‌లోకి ఇప్పుడిప్పుడే వస్తున్నాయి.

గ్రామీణులకు ఉపాధి.. సీతాఫలాలు గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపాధిగా మారింది. గిరిజనులు, చిరువ్యాపారులు అడవిలోకి వెళ్లి సీతాఫలాలను తెచ్చి విక్రయిస్తూ ఉపాధి, ఆదాయం పొందుతున్నారు. మార్కెట్‌లో లభించే అన్నిపండ్లకు వ్యాపారులు రసాయనాలు వినియోగిస్తారు. కానీ ఒక్క సీతాఫలానికి మాత్రం ఎలాంటి రసాయనాలు ఉపయోగించరు. వీటిని సహజంగా పండించడం సులువు.

సీతాఫలంతో ఆరోగ్యం..



సీతాఫలం ఆరోగ్యానికి మంచిది. ఎక్కువ తింటే దగ్గు, జలుబు వస్తుంది. సీతాఫలంలో సీ విటమిన్ ఎక్కువగా ఉండడంతో జీర్ణ సంబంధిత సమస్యలు తొలుగుతాయి. అధిక పోషకాలు ఉంటాయి.

– డాక్టర్ రాజు, పీహెచ్‌సీ, జగన్నాథపురం

ఉపాధి లభిస్తుంది..



ప్రతీ సంవత్సరం అటవీ ప్రాంతంలో సీతాఫలాలను సేకరించి హోల్‌సేల్‌గా విక్రయిస్తుంటాం. తద్వారా ఉపాధి పొందుతున్నాం. అడవిలో సీతఫలాలు అధికంగా ఉండటంతో సీజన్ విక్రయిస్తుంటాం.

– రాంబాబు, లక్ష్మీదేవిపల్లి

ఎదురు చూస్తున్నా..



ప్రకృతిలో లభించే స్వచ్ఛమైన ఫలం సీతాఫలం వాటిని సీజన్‌లో కొనుగోలు చేసి తింటాం. సీజన్ ఎప్పుడు వస్తొందా అని ఎదురు చూస్తుంటాను. ప్రతీ మూడు నాలుగు రోజులకు సీతాఫలాలు కొని తింటాను.

– రమేష్ రాథోడ్, టీచర్

లంబాడీలు రాజ్యాంగం ప్రకారం ఎస్టీలు



జూలూరుపాడు: అభివాదం తెలుపుతున్న నాయకులు

జూలూరుపాడు: లంబాడీలు రాజ్యాంగ బద్ధంగా షెడ్యూల్డ్ తెగలుగా గుర్తించబడ్డారని బంజారా నాయకులు తెలిపారు. శనివారం జూలూరుపాడులో లంబాడీ సంఘాల కోఆర్డినేటర్ గుగులోత్ కేశ్యా నాయక్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. మాట్లాడుతూ కొంతమంది ఎమ్మెల్యేలు లంబాడీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఆరోపణలు చేస్తున్నారన్నారు. అన్నదమ్ములుగా ఉన్న బంజార, ఆదివాసీల మధ్య ఘర్షణ వాతావరణాన్ని సృష్టిస్తూ రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. సుప్రీంకోర్టులో లంబాడీలపై దాఖలైన పిటీషన్‌కు వ్యతిరేకంగా ఆదివారం కొత్తగూడెంలో జరగనున్న లంబాడీ ఆత్మగౌరవ మహార్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం చంద్రుగొండ సెంటర్‌లోని డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ శంకర్‌నాయక్, గుగులోత్ రాజేష్, మోహన్, లకావత్ నాగేశ్వరరావు, రాందాస్, ధరావత్ కాన్సీరామ్, రమేష్, బానోత్ దుర్గాప్రసాద్, హలావత్ నరసింహారావు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: బంజారాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని జరుగుతున్న కుట్రలకు నిరసనగా ఆదివారం కొత్తగూడెంలో నిర్వహిస్తున్న ఆత్మగౌరవ ర్యాలీకి బంజారాలు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సేవాలాల్ సేన మండల అధ్యక్షుడు వాంకుడోత్ రమేష్ కోరారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు.

టేకులపల్లి: 14న లక్ష్మీదేవిపల్లి మార్కెట్ యార్డు నుంచి పోస్టాఫీసు వరకు జరగనున్న లంబాడీల ఆత్మగౌరవ ర్యాలీకి టేకులపల్లి మండలంలోని లంబాడీలు భారీ సంఖ్యలో తరలిరావాలని లంబాడీల జేఏసీ నేత ధరావత్ ప్రేమ్‌చంద్‌నాయక్ పిలుపునిచ్చారు. శనివారం టేకులపల్లి మండలం సేవాగఢ్ సేవాలాల్ ఆలయం వద్ద జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భూక్యా లాలు, మూడు హుస్సేన్, మాలోతు శివ, బానోతు కిషన్, భూక్యా కిషోర్, వాంకుడోత్ హతీరామ్, బోడ పూన్యా, మోతీలాల్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు న్యాయం చేయాలి



గ్రంథాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్‌వీ నాయకులు

ఇల్లెందు: కాంగ్రెస్ ప్రభుత్వం అటు నిరుద్యోగులను, ఇటు గ్రూప్ వన్ అభ్యర్థులను మోసం చేసిందని బీఆర్‌ఎస్‌వీ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు శనివారం ఇల్లెందులో బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో గ్రంథాలయం ఎదుట ఆందోళన చేశారు. అనంతరం గ్రంథపాలకురాలికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాసాని హరిప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో తెలంగాణ నిరుద్యోగ యువత ఏళ్లకు ఏళ్లు గ్రంథాలయాలలో చదివి పరీక్షలు రాశారని గుర్తు చేశారు. అలాంటి ఆశా జీవులతో పాలకులు చెలగాటం ఆడుతున్నారని వాపోయారు. గ్రూప్ వన్ పరీక్షలను పూర్తి చేయాలని పట్టుదలకు పోయిన రేవంత్ సర్కార్‌కు గట్టి ఎదురు దెబ్బ తగిలిందన్నారు. టీజీపీఎస్సీలో అవకతవకలు జరిగాయని కేవలం రెండు సెంటర్ల నుంచి 74 ర్యాంకులు రావడం అనుమానాలు ఉన్నట్లు చెప్పారు. మాట్లాడితే కేసులు పెడుతున్నారని, నిరుద్యోగులు, యువతకు న్యాయం చేయాలని కోరారు. భూక్యా సురేష్, నిఖిల్, ఇంతియాజ్, వైకుంఠం, బిపిన్ నాయక్, చాంద్‌పాషా, గండమళ్ల రామకృష్ణ, గౌస్‌పాషా, సోను, కిరణ్, రవికాంత్, వలీ, సమీర్, సఫిక్, సోహెల్ పాల్గొన్నారు.

క్షమాపణ చెప్పండి..

సింగరేణి(కొత్తగూడెం): గతంలో బొగ్గగనుల వేలాన్ని కొన్ని కార్మిక సంఘాలు అడ్డుకోవడంతో సింగరేణికి తీరని నష్టం జరిగిందని, ఈ విషయంలో కార్మికులకు క్షమాపణ చెప్పాలని బీఎంఎస్ జాతీయ కార్యదర్శి పి.మాధవనాయక్ కోరారు. కాగా, గనుల వేలంలో పాల్గొనాలని తాజాగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నామని తెలిపారు. కొత్తగూడెంలోని బీఎంఎస్ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు గతంలోనే తాము సింగరేణి వేలంలో పాల్గొనాలని సూచిస్తే కొన్ని సంఘాలు అడ్డు చెప్పి సంస్థకు నష్టం చేశాయని ఆరోపించారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం హర్షణీయమన్నారు. నాయకులు కృష్ణారెడ్డి, పవన్‌కుమార్, లట్టి జగన్మోహన్, జి.వెంకటరెడ్డి, ఎం.శ్రీనివాస్, మొగలిపాక రవి, నాగప్రసాద్, ఊట్ల గణేష్, శ్రవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్‌లో వైద్యశిబిరం



వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

జూలూరుపాడు: స్థానిక ఎస్సీ బాలురు సంక్షేమ వసతి గృహంలో జూలూరుపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం హెల్త్ క్యాంప్ నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని హెల్త్ సూపర్‌వైజర్ రత్నకుమార్ విద్యార్థులకు సూచించారు. ఆహారం తినే ముందు, తరువాత చేతులు శుభ్రం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారి వెంకటేశ్వర్లు, ఏఎన్‌ఎంలు రాణి, మంగమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

బియ్యం వితరణ

పాల్వంచరూరల్: రేగులగూడెం గ్రామానికి చెందిన ఇటీవల మృతి చెందిన మాజీ దళనాయకుడు వజ్జ బాబు నివాసానికి శనివారం బీఆర్‌ఎస్ నాయకులు కాంపెల్లి కనకేష్ వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. 50 కేజీల బియ్యాన్ని వితరణ చేశారు. రంజిత్, అరుణ్, సాయి, మురళీమోహన్, నిఖిల్, రితిక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వామిత్రకు అవార్డు



విశ్వామిత్రను సన్మానిస్తున్న నిర్వాహకులు

చుంచుపల్లి: ఏపీలోని పల్నాడు జిల్లా చిలకలూరిపేట జయజయసాయి ట్రస్ట్ ఆధ్వర్యాన ప్రకటించిన సాయి ప్రజాసేవ రత్న అవార్డును కొత్తగూడెం హౌసింగ్ బోర్డుకు చెందిన విశ్వామిత్ర చౌహాన్‌ను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ నరసింహచారి, సీడ్ మ్యాన్ ఆఫ్ ఇండియా హరినాథ్, డాక్టర్ సుష్మ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న డైలీవేజ్ వర్కర్ల సమ్మె

కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లోని ఎస్టీ బాలికల, బాలుర హాస్టళ్లల్లో పనిచేసే డైలీవేజ్ వర్కర్ల సమ్మె రెండోరోజు శనివారం కొనసాగింది. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ చేపట్టిన సమ్మె సాగుతోంది. విధులు బహిష్కరించి ఆందోళనలో పాల్గొంటున్నారు. సమ్మె శిబిరాలను సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, పీడీఎస్‌యూ నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపి మద్దతు ప్రకటించారు.

– సాక్షి నెట్‌వర్క్



పాల్వంచరూరల్: ఉల్వనూరు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో భోజనం వడ్డిస్తున్న టీచర్



ఇల్లెందు: ఆందోళన చేస్తున్న డైలీవేజ్ వర్కర్లు



టేకులపల్లిలో సమ్మె చేస్తున్న ఔట్‌సోర్సింగ్ వర్కర్లు

తల్లిదండ్రుల బాధ్యత పిల్లలదే..



న్యాయమూర్తి కీర్తి చంద్రికారెడ్డికి మొక్క అందజేస్తున్న నాగేశ్వరరావు

ఇల్లెందు: వయోభారం మీద పడిన తల్లిదండ్రులను పిల్లలు భారంగా భావిస్తున్నారని, ఈ తరుణంలో అండగా ఉండాలని న్యాయమూర్తి డి.కీర్తిచంద్రికారెడ్డి అన్నారు. శనివారం ఇల్లెందు కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఇల్లెందు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ తల్లిదండ్రుల నుంచి సంక్రమించిన ఆస్తులు పంచుకుంటున్నారని, పోషణను వదిలేస్తున్నట్లు చెప్పారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులు వారి ఆర్థిక స్థితి బాగలేక కోర్టులను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. ఇలా కోర్టులను ఆశ్రయించే కేసుల తన దృష్టికి వచ్చాయని ఆమె తెలిపారు. కుమారుడైనా, కుమార్తె అయినా వృద్ధాప్యంలో వారి బాధ్యత తీసుకోవాలన్నారు. లోక్ ఆదాలత్‌ల ముఖ్య ఉద్దేశం క్షణికావేశంలో పెట్టుకున్న కేసులు రాజీపడదగ్గవి ఉంటే ఇరువర్గాలు ఆదాలత్‌లో రాజీ పడవచ్చన్నారు. లోక్ అదాలత్‌లో రాజీ పడితే హైకోర్టుకు వెళ్లినా అప్పీల్‌కు అవకాశం ఉండదని చెప్పారు. పంతాలకు వెళ్లకుండా లోక్ అదాలత్‌లో రాజీ పడాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కీర్తికార్తీక్ రెడ్డి, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ టి.ఇందిర, సీనియర్ న్యాయవాదులు ఎస్.వెంకటనర్సయ్య, నారాయణ, వెంకటేశ్వర్లు, డీఎస్పీ చంద్రభాను, సీఐ టి.సురేష్, పోలీస్, కోర్టు సిబ్బంది, ఆర్య వైశ్య సంఘం మండల అధ్యక్షుడు పి.నాగేశ్వరరావు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

మార్పు వస్తేనే శిక్షణ సఫలీకృతం



నిత్యావసరాలు అందజేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

కొత్తగూడెంఅర్బన్: సింగరేణి సెక్యూరిటీ సిబ్బందిలో మార్పు కనిపిస్తేనే తీసుకున్న శిక్షణ సఫలీకృతం అవుతుందని సెక్యూరిటీ జీఎం చందా లక్ష్మీనారాయణ అన్నారు. 8వ తేదీ నుంచి వారం రోజులు జరిగిన ఎస్ – పీసీ సెక్యూరిటీ సిబ్బంది 36వ బ్యాచ్ ఫస్ట్ ఎయిడ్ – ఫైర్ ఫైటింగ్ శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఎస్ అండ్ పీసీ విభాగంలో ప్రతీ సెక్యూరిటీ సిబ్బందికి ఫస్ట్ ఎయిడ్, ఫైర్ ఫైటింగ్‌పై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, తద్వారా సెక్యూరిటీ సిబ్బంది పనితీరు గణనీయంగా మెరుగుపడిందని, శిక్షణకాలంలో ఫస్ట్ ఎయిడ్, ఫైర్ ఫైటింగ్‌లోని అన్ని అంశాలపై అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీచే బోధించడం జరిగిందని చెప్పారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలను ఏరియాలకు వెళ్లిన తర్వాత తోటి సెక్యూరిటీ సిబ్బందితో చర్చించి, అవసరం వచ్చినప్పుడు ఫస్ట్ ఎయిడ్ చేయడంలో, అగ్ని ప్రమాదాలను నివారించడంలో ముందుండాలని, ఎస్ – పీసీ విభాగం ప్రతిష్టను ఇనుమడింపజేసేలా విధులు నిర్వహించాలని, శిక్షణ కాలంలో నేర్చుకున్న దాని ద్వారా మన నడవడిక, విధులు నిర్వహించే విధానంలో మార్పు రావాలని, మెరుగైన వృత్తి నైపుణ్యం, క్రమశిక్షణ, నీతినిజాయితీ, అంకితభావంతో విధులు నిర్వహిస్తూ, సింగరేణి ఆస్తులను పరిరక్షించాలని సూచించారు. అనంతరం ఉత్తమ ట్రైనీలుగా ఎంపికైన సామల రవి, బి.కోటసాంబయ్యకు బహుమతులు అందజేశారు. 36వ బ్యాచ్ ఫస్ట్ ఎయిడ్ – ఫైర్ ఫైటింగ్ శిక్షణ సిబ్బంది నిత్యావసరాలను శ్రీ జ్యోతి అనాథ వృద్ధుల శరణాలయ నిర్వాహకులకు అందజేశారు.

ప్రభుత్వ వైఫల్యంతోనే రైతు ఆత్మహత్య



సుమన్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న హరిప్రియ

ఇల్లెందురూరల్: ప్రభుత్వం రైతులకు యూరియా సకాలంలో సరఫరా చేయలేకపోవడంతోనే యువ రైతు ప్రాణాలు కోల్పోయాడని మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ ఆరోపించారు.

యూరియా కోసం జరిగిన తోపులాటలో డబ్బులు పోగొట్టుకొని, బస్తా తేలేదన్న ఆవేదనలో భార్య మందలింపునకు, క్షణికావేశానికి గురై ఆత్మహత్య చేసుకున్న సుమన్ భౌతికకాయాన్ని శనివారం ఆమె సందర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సుమన్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దాస్యం ప్రమోద్‌కుమార్, పర్చూరి వెంకటేశ్వరరావు, ఘాజీ, గిన్నారపు రాజేష్, బానోత్ నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటుకు అప్పగిస్తే ప్రతిఘటన

సూపర్‌బజార్(కొత్తగూడెం): మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తే ప్రతిఘటన తప్పదని ఏఐటీయూసీ అనుబంధ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా హెచ్చరించారు. యూనియన్ జిల్లా 3వ మహాసభ సీపీఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్‌లో శనివారం జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ పేద విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రారంభించిన మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తే లక్ష్యం నెరవేరదనే ఉద్దేశంతో గౌరవ సుప్రీంకోర్టు ప్రైవేట్‌కు నిరాకరిస్తూ గైడ్‌లైన్స్ విడుదల చేసిందని దీనిని రాష్ట్ర ప్రభుత్వం కచ్చితంగా పాటించి సెంట్రలైజ్ కిచెన్ విధానాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తోందని విమర్శించారు. నిత్యవసరాలు, కోడిగుడ్లు ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కంచర్ల జమలయ్య, నరాటి ప్రసాద్, మున్నా లక్ష్మీకుమారి, వేల్పుల మల్లికార్జున్, నిమ్మటూరి రామకృష్ణ, సత్తెనపల్లి విజయలక్ష్మి, దాసుల పుష్పవతి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



బీఆర్‌ఎస్‌వీ నాయకులకు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

పాల్వంచ: గిరిజన పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో పనిచేస్తున్న డైలీవేజ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బీఆర్‌ఎస్‌వీ విద్యార్థి సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బత్తుల మధుచంద్, పట్టణ అధ్యక్షుడు జూపెల్లి దుర్గాప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక గిరిజన హాస్టల్ ఎదుట గిరిజన పోస్ట్ మెట్రిక్ హాస్టల్ వర్కర్స్ యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలెక్టర్ గెజిట్ ప్రకారం జీతాలు చెల్లించాలని, మరణించిన వారి స్థానంలో కుటుంబ సభ్యులకు పని కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం అందించాలన్నారు. కార్మికులకు బీఆర్‌ఎస్‌వీ అండగా ఉంటుందన్నారు. అనంతరం కార్మికులు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని బీఆర్‌ఎస్‌వీ నాయకులకు అందించారు. కార్యక్రమంలో రాజు, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

నాటి సాయుధ పోరాటాలే స్ఫూర్తి



టేకులపల్లి: ఎర్రజెండా ఎగురవేస్తున్న రామ్‌చందర్

పాల్వంచ: మట్టి మనుషులను పోరాట యోధులుగా మార్చింది కమ్యూనిస్టుల ఎర్రజెండానేనని, సాయుధ పోరాట చరిత్ర దేశానికి దిక్సూచి అని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు సీపీఐ ఆధ్వర్యంలో జరుగుతున్న తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల సందర్భంగా శనివారం స్థానిక చండ్ర రాజేశ్వరరావు భవన్ నుంచి పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. అమరుల స్తూపాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, సీపీఐ పతాకాన్ని ఆవిష్కరించారు. సాబీర్ పాషా మాట్లాడుతూ తెలంగాణాలో సాయుధ పోరాటం నేటికి ప్రజలకు స్ఫూర్తినిస్తోందన్నారు. తెలంగాణా విముక్తి పోరాటం ప్రపంచ ప్రజా ఉద్యమాలకు ఆదర్శమన్నారు. నిజాం స్వాధీనంలో ఉన్న తెలంగాణ భూభాగాన్ని భారత దేశంలో అంతర్భాగం చేసింది కమ్యూనిస్టుల ఉద్యమమేనన్నారు. కార్యక్రమంలో ఉప్పుశెట్టి రాహుల్, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, విశ్వేశ్వరరావు, పద్మజ, అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, ఇట్టి వెంకట్రావ్, అజిత్, డి.చెన్నయ్య, కొంగర అప్పారావు, జర్పుల మోహన్, రాకేష్, సుజన్, సత్యనారాయణ, ఖాసీం, కరీం, శ్రీను, బాలకృష్ణ, కిషన్, రామకృష్ణ, ఈశ్వరమ్మ, మేరమ్మ తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: తెలంగాణ సాయుధ పోరాట యోధుల త్యాగాలు చిరస్మరణీయమని, వారి ఆశయ సాధనకు ప్రతీఒక్కరు ఉద్యమించాలని సీపీఐ జిల్లా నాయకుడు గుగులోత్ రామ్‌చందర్ నాయక్ పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుల త్యాగాలు, నైజాం నిరంకుశ పాలన అంతం కోసం సాగిన పోరాటాల స్ఫూర్తిగా వారోత్సవాల్లో భాగంగా శనివారం మండల కేంద్రంలో ఎర్రజెండా ఆవిష్కరించారు. తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతంగ పోరాట వారోత్సవాలు ఈనెల 17 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, బొమ్మగాని ధర్మభిక్షం, చాకలి ఐలమ్మ, మొహిద్దీన్ వంటి మహనీయ సాయుధ పోరాటం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అయిత శ్రీరాములు, రవీందర్, లక్ష్మణ్, బాలు, సత్యం, రాములు, కృష్ణ, యువరాజు, సోనీ, బుజ్జి, శారద, కమల, సంధ్య తదితరులు పాల్గొన్నారు.